సంపుటి :02 సంచిక :190 పేజీలు :06
వెల ₹5
# అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
సోమవారం 22, సెప్టెంబర్ 2025

## రేపు మేడారానికి ముఖ్యమంత్రి రేవంత్

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



02

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- నారాయణపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు
- ఇద్దరు మావోయిస్టులు మృతి
- మృతుల్లో ఒకరు మావోయిస్టు పార్టీ అగ్రనేత రామచంద్రారెడ్డి
- మరొకరు పార్టీ సభ్యుడు సత్యనారాయణ

02







# సింగరేణీయులకు శుభవార్త

## సంస్థ లాభాల్లో తేలిన కార్మికుల వాటా


### 34శాతం ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

- రూ.819 కోట్లు పంచనున్న యాజమాన్యం
- ఒక్కో కార్మికుడి ఖాతాలో రూ.1.95 లక్షల చొప్పున జమ
- కాంట్రాక్ట్ కార్మికులకూ రూ.5,500..
- సింగరేణి కార్మికుల హర్షం

02

దసరా సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు శుభవార్త తెలిపింది. సంస్థ లాభాల్లో 34 శాతం వాటాను బోనస్‌గా పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారికంగా సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి ప్రకటించారు. ఈ నిర్ణయంతో, 41 వేల మంది శాశ్వత ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ. 1,95,610 చొప్పున, అలాగే 30 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ. 5,500 చొప్పున అందనుంది. మొత్తంగా రూ. 819 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఈ బోనస్‌తో కార్మికులలో పండుగ సంబురాలు ముందుగానే మొదలయ్యాయి.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి





## మార్కెట్ లోకి కల్తీ నూనె

- ఆరోగ్యానికి హానికరమని వినియోగదారుల ఆందోళన
- ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టాలని డిమాండ్

04

"దసరా పండుగ వేళ మార్కెట్లోకి కల్తీ నూనె ప్రవేశించింది. బ్రాండెడ్ ఉత్పత్తులను పోలిన ప్యాకెట్లలో కల్తీ నూనె విక్రయిస్తున్నారని సమాచారం. దీంతో వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పరకాలలో పశువుల ఎముకలతో నూనె తయారు చేసిన ఘటనను ప్రజలు ఇంకా మరిచిపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కల్తీ నూనె వార్తలు వినియోగదారులకు మరింత భయాన్ని కలిగిస్తున్నాయి." -అక్షరదర్బార్, పరకాల

# యూరియా పక్కదారి!

**పరకాల నుంచి కమలాపురం మండలానికి బయల్దేరిన యూరియా**

05

రైతులకు పంపిణీ చేయాల్సిన యూరియా పక్కదారి పట్టింది. పరకాల నుంచి కమలాపురం మండలానికి తరలిస్తున్న పది యూరియా బస్తాలను రైతులు నడికూడ వద్ద పట్టుకున్నారు. దీని వెనుక వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) కాటం రాజు హస్తం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి విచారణకు ఆదేశించారు. –అక్షర దర్బార్, పరకాల

- మార్గమధ్యంలో నడికూడ వద్ద పట్టుకున్న రైతులు
- ఏఈఓ అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపణ
- విచారణకు ఆదేశించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి





# ఛత్తీస్ గఢ్ లో ఎన్ కౌంటర్

- నారాయణపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు
- ఇద్దరు మావోయిస్టులు మృతి
- మృతుల్లో ఒకరు మావోయిస్టు పార్టీ అగ్రనేత రామచంద్రారెడ్డి
- మరొకరు పార్టీ సభ్యుడు సత్యనారాయణ

అక్షరదర్బార్, నారాయణపూర్: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి నెత్తురు చిందింది. భద్రతాదళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టు పార్టీ అగ్రనేతలు మృతిచెందారు. మృతుల్లో ఒకరిని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు దాదాగా, మరొకరిని పార్టీ సభ్యుడు కదారి సత్యనారాయణగా గుర్తించారు. మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్ సరిహద్దు వెంబడి ఉన్న నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అటవీప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందని సమాచారం అందుకున్న అక్కడి ఉన్నతాధికారులు ఆ ప్రాంతానికి భారీగా భద్రతా దళాలను మోహరింపజేశారు. జవాన్లు ఆ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా, మావోయిస్టులు వారికి తారసపడి కాల్పులు ప్రారంభించారు. అప్రమత్తమైన జవాన్లు తిరిగిఎదురుకాల్పులకు దిగారు. ఇరువర్గాల మధ్య దాదాపు అరగంట పాటు భీకర పోరు జరిగింది. జవాన్ల ధాటికి తాళలేని మావోయిస్టులు కాల్పులు జరుపుతూ దట్టమైన అటవీప్రాంతంలోకి పరాయ్యారు. కాల్పుల అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో ఒకరిని మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు కట్టా రామచంద్రారెడ్డి, మరొకరిని పార్టీ సభ్యుడు కదారి సత్యనారాయణగా గుర్తించారు. ఘటనా స్థలంలో జవాన్లు ఏకే 47 రైఫిల్స్, ఇతర మందుగొండు సామగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఆ ప్రాంతంలో జవాన్ల కూంబింగ్ కొనసాగుతూనే ఉన్నది. తప్పించుకు పారిపోయిన మావోయిస్టుల కోసం భద్రతా దళాలు అడవిని జల్లెడ పడుతున్నాయి.








- సంస్థ లాభాల్లో తేలిన కార్మికుల వాటా
- 34శాతం ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.819 కోట్లు పంచనున్న యాజమాన్యం
- ఒక్కో కార్మికుడి ఖాతాలో రూ.1.95 లక్షల చొప్పున జమ
- కాంట్రాక్ట్ కార్మికులకూ రూ.5,500..
- సింగరేణి కార్మికుల హర్షం

# సింగరేణీయులకు శుభవార్త

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించింది. సంస్థ లాభాల్లో 34 శాతం కార్మికులకు పంచాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఒక్కో కార్మికుడి ఖాతాల్లో రూ.1,95,610 చొప్పున జమ చేస్తామని వివరించారు. 'సింగరేణి పరిధిలో 41వేల మంది శాశ్వత ఉద్యోగులకు ఉన్నారని, మొత్తంగా వారి వాటాను రూ.819 కోట్లు బోనస్‌గా జమ చేయనున్నామని తెలిపారు. రాష్ట్ర సాధనలో సింగరేణీయులు ముఖ్య పాత్ర పోషించారని గుర్తు చేశారు. అది తామెప్పుడూ ఆ ఉద్యమాలను మర్చిపోలేమని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడేలా సింగరేణి ఎదగాలని ఆకాంక్షించారు.

**- కాంట్రాక్ట్ ఉద్యోగులకూ..**

సంస్థ పరిధిలోని 30వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకూ ఒక్కొక్కరి ఖాతాలో రూ.5,500 చొప్పున జమ చేయిస్తామని సీఎం స్పష్టం చేశారు. అలాగే కోల్ ఇండియా ఇచ్చే బోనస్‌ను దీపావళి పండుగకు జమ చేస్తామని తెలిపారు. భవిష్యత్‌లోనూ సింగరేణి కార్మికులకు అండగా ఉంటా. జీఎస్టీ మార్పుల వల్ల రాష్ట్రాలు ఆదాయం కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కోల్పోతున్న ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాల్సిన అవసరముందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని రాష్ట్రాలపై భారం వేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. వచ్చే ఐదేళ్ల పాటు కేంద్రం వయబులిటీ గ్యాప్ ఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**- రూ.3 వేల కోట్ల అంచనా..**

2024-25 ఆర్థిక సంవత్సరానికి సింగరేణికి సుమారు రూ.3 వేల కోట్ల లాభాలు వచ్చే అవకాశం ఉందని సింగరేణి యాజమాన్యం అంచనా వేస్తున్నది. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.2,412 కోట్ల లాభాలను ఆర్జించింది. ఆ లాభాల్లో 33 శాతం.. అంటే రూ.796 కోట్లను కార్మికులకు బోనస్‌గా జమ చేసింది. ఈసారి లాభాలు మరింత పెరగనున్న నేపథ్యంలో, కార్మిక సంఘాలు లాభాల వాటా శాతం పెంచాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాయి. 35 శాతం వాటాను కార్మికులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశాయి. అయితే, రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యకు మధ్యే మార్గం చూపింది. కార్మికులు డిమాండ్ చేసినట్లు 35 శాతం కాకుండా, ఒక శాతం తగ్గించి 34శాతం బోనస్ పంచాలని నిర్ణయించింది. రాష్ట్రప్రభుత్వం రూ.900 కోట్ల వరకు కార్మికులకు వాటా వస్తుందని అంచనా వేయగా, చివరకు అది రూ.819 కోట్లని తేలింది. ఏదేమైనా ప్రభుత్వం 34శాతం బోనస్ ఇవ్వడంపై కార్మిక సంఘాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# తాడిచెర్ల ఓసీపీని సందర్శించిన ఉన్నతాధికారులు

అక్షర దర్బార్ మల్హర్ : మండల కేంద్రమైన తాడిచెర్లలో బొగ్గు తవ్వకాలు చెపట్టిన ఏఎమ్మార్ కంపెనీ ఓసిపి బ్లాక్-1ను సోమవారం ఐఆర్ టిఎస్ డైరెక్టర్ శ్రీనాగ్య, జెన్కో జనరల్ మేనేజర్ మోహసన్ రావు, ఎమ్మార్ సిఈఓ డిఎల్ ఆర్ ప్రసాద్, కెటిపి సిఈ ప్రకాష్, ఎస్ఈ లు రామకృష్ణన్, ముత్యాల రావు, తదితర ఉన్నతాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఓసిపిలో భద్రత, సెప్టి ద్వారా బొగ్గు తవ్వకాల తీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ కెఎస్ఎన్ మూర్తి, మేనేజర్ శ్రీనివాస్, సెప్టి అధికారి సురేష్, డిజిఎం సర్వోత్తమ్, కృష్ణ పాల్గొన్నారు



# రేపు ములుగు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

**- మేడారం అభివృద్ధి పనులపై సమీక్ష**



అక్షరదర్బార్, మేడారం: రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, ప్రజా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు తాడ్వాయి మండలంలోని మేడారం చేరుకుంటారు. ఇక్కడ ఆలయ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మేడారంలో చేపట్టిన పనులపై యంత్రాంగానికి సలహాలు సూచనలు ఇవ్వనున్నారు.

# ఛత్తీస్ గఢ్ సీఎంతో మంత్రి ఉత్తమ్ భేటీ

**- సమ్మక్క సాగర్ బరాజ్ సమస్యలపై చర్చ**



అక్షరదర్బార్, హైదరాబాద్: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ బరాజ్ నిర్మాణంలో ఛత్తీస్‌గఢ్ పరిధిలోని కొన్ని గిరిజన గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని ఆ రాష్ట్రం నుంచి ఆరోపణలు ఉన్నాయి. అలాగే భూసేకరణపైనా అక్కడి గ్రామాల నుంచి వ్యతిరేకత ఉంది. ఈ సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ చూపుతున్నది. దీనిలో భాగంగా రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు చేరుకున్నారు. ఆ రాష్ట్ర సీఎం విష్ణు దేవ్సాయ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. బరాజ్ నిర్మాణంపై అనేక అంశాలు చర్చించారు.

# పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు.!

**ఆరు మొబైల్స్, మూడు బైక్స్, రూ.29 వేలు స్వాధీనం**

అక్షర దర్బార్ మల్హర్ : మండల కేంద్రమైన తాడిచెర్లలో పలు ప్రాంతాల్లో చట్ట వ్యతిరేకమైన పేకాట అడుతున్నారనే సమాచారం మేరకు కొయ్యూర్ ఎస్సై నరేష్,ఎస్సై-2 రాజన్ తన సిబ్బందితో కలిసి సోమవారం పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తొమ్మిది మంది వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి రూ.29,300,మూడు బైక్స్, ఆరు సెల్ ఫాన్స్ లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లుగా పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడారు. ఎవరైనా ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించడం జరుగుతుందని తెలిపారు.

## పండుగను పార్టీలకతీతంగా నిర్వహించుకుందాం

### బుర్ర దేవేందర్ గౌడ్



అక్షర దర్బార్, పరకాల: బతుకమ్మ పండుగను పార్టీలకతీతంగా నిర్వహించాలని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. నడికూడ మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కానీ ఆదివారం మహిళలు ఎంగిలిపూల బతుకమ్మ ఆడుతుండగా, కొంతమంది ట్రాన్స్ ఫార్మర్‌ను బంద్ చేసి బతుకమ్మ ఆడుతున్న మహిళలను ఇబ్బంది పరిచారని, ఇలాంటి చర్యలపై ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. " పార్టీలకతీతంగా బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించాలని, మహిళలు స్వేచ్ఛగా పండుగ జరుపుకునేందుకు మనం అందరం సహకరించాలి," అని బుర్ర దేవేందర్ గౌడ్ పేర్కొన్నారు.

## గుంతల రోడ్లతో ఇబ్బందులెన్నో

### బాగు చేయాలని ప్రజల డిమాండ్

అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండలం మూడు చెక్కలపల్లి గ్రామ శివారు రోడ్డు దయనీయ స్థితిలో ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే రోడ్డు గుంతల మయం అవుతూ, నీరు నిలిచి బురదగా మారిపోవడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రత్యేకంగా రైతులు, కూలీలు రాకపోకల్లో పడుతున్న ఇబ్బందులు అధికమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ఈ సమస్యను పట్టించుకోలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించి తక్షణమే సిసి రోడ్డును ఏర్పాటు చేయాలని మూడు చెక్కలపల్లి వాసులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని వేడుకుంటున్నారు.







## ఆశిరెడ్డిపల్లిలో అనధికార ఆధార్ అప్డేట్ కలకలం

టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్ మైక్ ద్వారా ఆధార్, ఓటర్ కార్డుల వివరాలు మార్చుకోవచ్చని ప్రకటించడంతో గ్రామస్థులు పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రజలు నిజమని నమ్మి డబ్బులు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ ప్రక్రియకు ప్రభుత్వ అనుమతి లేదని తేలింది. పంచాయతీ కార్యదర్శి నిశ్శబ్దంగా ఉండడం విమర్శలు రేపింది. ఎంపీడీవో అనిత “ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేవు” అని స్పష్టం చేశారు. అధికారుల అనుమతి లేకుండా జరిగే ప్రక్రియలపై అప్రమత్తంగా ఉండాలని, ఆధార్ అప్డేట్ కోసం కేవలం ప్రభుత్వ ఆధారిత సెంటర్ల ను మాత్రమే వినియోగించుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## జాతీయ అవార్డుకు ఎంపికైన మంగళపల్లి శ్రీనివాస్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్ళపల్లి మండలానికి చెందిన మంగళపల్లి శ్రీనివాస్ గత 30 ఏళ్లుగా అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యపాత్ర పోషించి ఏబిసిడి వర్గీకరణ సాధించడంలో ఎంతో కీలకంగా పని చేశారని, అంటరాని తనం నిర్మూలన కోసం కృషి చేసినందుకు గాను "స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో" అనే స్వచ్ఛంద సంస్థ మంగళంపల్లి శ్రీనివాస్ సేవలను గుర్తించి అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. అక్టోబర్ 31న తెలుగు యూనివర్సిటీ నాంపల్లిలో అవార్డును బహుకరించనున్నట్లు స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో నిర్వాహకులు డాక్టర్ ఆకుల రమేష్ తెలిపారు.

## ప్రతి సమస్యపై నిరంతర పర్యవేక్షణ

### –ఎస్పీ కిరణ్ ఖరే



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: భూపాలపల్లి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ కిరణ్ ఖరే ప్రజల నుండి 12 వినతిపత్రాలు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి సమస్యపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, ప్రజలకు త్వరితగతిన న్యాయం జరిగేలా కట్టుబడి ఉంటామని తెలిపారు. పారదర్శకత పోలీసు విభాగం ప్రధాన ధ్యేయమని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని భరోసా ఇచ్చారు.

## యూరియా పంపిణీ పరిశీలన



అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలకేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్,సహాయ వ్యవసాయ సంచాలకులు జగదీశ్వర్ రెడ్డి , టెక్నికల్ ఏవో కే కమలాకర్ , పరకాల ఏవో శ్రీనివాస్, ఏ ఇ ఓ అర్చన శాయంపేట మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా పంపిణీని పరిశీలించారు.అనంతరం నానో యూరియా వాడకం మరియు దానివల్ల కలిగే లాభాల గురించి అవగాహన కలిపించారు.అవసరం మేరకు యూరియా పంపిణి చేయబడుతుందని రైతుల ఆందోళన చెందవద్దని సూచించారు.రైతువేదికలో వ్యవసాయశాఖ సిబ్బందికి పంట నమోదు, రైతు రిజిస్ట్రేషన్ మరియు యూరియా కూపన్ జారిచేయడంలో తగు సూచనలు చేశారు.

## దామెర మండల ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలి

### డీఆర్ఓ కు వినతిపత్రం ఇచ్చిన బీజేపీ మండల అధ్యక్షుడు రాజ్ కుమార్



అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా దామెర మండలంలో బస్సు సదుపాయాల లేమితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటికి పరిష్కారం చూపాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెల్పుల రాజ్‌కుమార్ హనుమకొండ డీఆర్ఓ వై.వి. గణేష్ కు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా బస్ షెల్టర్ నిర్మాణం, హన్మకొండ–దామెర–పరకాల మార్గంలో బస్సుల సంఖ్య పెంపు, ఉరుగొండలో ఎక్స్‌ప్రెస్ బస్సులకు హాల్ట్ ఏర్పాటు, నిలిపివేసిన పసరగొండ, ముస్త్యాలపల్లి మార్గాల్లో సర్వీసులు పునరుద్ధరణ వంటి అంశాలు ఉన్నాయి. లాదెళ్ళ, సింగరాజుపల్లి, వెంకటాపురం, పులుకుర్తి, తక్కలపాడు, ఓగులాపూర్ తదితర గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో యువ మోర్చా సభ్యుడు బత్తుల సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## 28న ఇనుగుర్తిలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

అక్షర దర్బార్, ఇనుగుర్తి: ఇనుగుర్తి మండల కేంద్రంలో ఈనెల 28వ తేదీన అభినవ ద్రోణాచార్యుడు కందునూరి కొమురయ్య స్మారకార్థం మహబూబాబాద్ జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఇనుగుర్తి వాలీబాల్ అసోసియేషన్ బాధ్యులు, ఫిజికల్ డైరెక్టర్లు బొబ్బిలి వెంకట్ రెడ్డి, కందునూరి గీత, స్థానిక హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ప్రణయ్ లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు మరియు పురుషులకు వేరు వేరు విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పురుషుల విభాగంలో ప్రథమ స్థానం 10 వేలు, ద్వితీయ స్థానం 5 వేలు, తృతీయ స్థానం 3 వేలు మహిళల విభాగంలో ప్రథమ స్థానం 4 వేలు, ద్వితీయ స్థానం 2 వేల నగదు బహుమతులతో పాటూ..మెమొంటోలను అందజేయనునట్లు తెలిపారు. ఔత్సాహికులైన క్రీడాకారులు మండలాల వారిగా తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవడానికి 98491 28440, 9441613725, 9347045680 నంబర్లకు ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు. టోర్నమెంట్ లో పాల్గొనే క్రీడాకారులు 28న ఇనుగుర్తి ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణం వద్ద రిపోర్ట్ చేయాలని, క్రీడాకారులకు భోజన వసతి కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సింగరేణి కార్మికులకు దసరా బోనస్

### ప్రభుత్వానికి ధన్యవాధాలు తెలిపిన ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షర దర్బార్, భూపాలపల్లి: సింగరేణి 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను దసరా సందర్భంగా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. మొత్తం రూ.2360 కోట్ల లాభాల్లో 34 శాతం అయిన రూ.819 కోట్లు కార్మికులకు పంచనున్నారు. ఒక్కో కార్మికుడికి రూ.1,95,610, కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 చొప్పున అందించనున్నారు. దేశంలోనే తొలిసారి కాంట్రాక్ట్ కార్మికులకు కూడా బోనస్ ఇవ్వడం విశేషం. ఈ సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు.



# అమ్మకానికి పసికందు

- మైనర్ ప్రసవం..

**ఆపై శిశువు అమ్మకానికి యత్నం**

అక్షరదర్బార్, మరిపెడ: మానవత్వాన్ని మరిచి పసికందును అమ్మకానికి పెట్టిన అమానవీయ ఘటన ఖమ్మం జిల్లాలో వెలుగులోకి వచ్చింది.మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన ఓ బాలిక(17) ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవించింది. ఆసుపత్రిలోని ఓ నర్సు సాయంతో శిశువును అక్రమంగా విక్రయించడానికి యత్నించగా, సమాచారం అందు కున్న వైద్యారోగ్య శాఖ అధికారులు విచారణ చేపట్టారు. బాలిక గర్భం దాల్చడానికి కారణమైన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.



### ప్రజా సమస్యలను విస్మరించి

# పరస్పర ఆరోపణలా?

**బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ**

అక్షర దర్బార్, శాయంపేట: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజా సమస్యలను విస్మరించి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నాయని బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ విమర్శించారు. ఇసుక అక్రమ రవాణా, భూమి కబ్జాలే ఈ రెండు పార్టీల చరిత్ర అని, అవినీతి, దోపిడీ తప్ప ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి లేదని ఆయన అన్నారు. మండలంలో యూరియా కొరత, మహాలక్ష్మి పథకం కింద హామీ ఇచ్చిన రూ.2,500, కొత్త పెన్షన్లు ఇప్పటివరకు అంద కపోవడం విడ్డూరమని రామకృష్ణ ఎద్దేవా చేశారు. ఈ ధోరణి కొనసాగితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

# ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కరించాలి

### ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన

**అదనపు కలెక్టర్**

అక్షర దర్బార్, భూపాలపల్లి : సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దరఖాస్తుదారుల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకుని 42 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిష్కారంలో జాప్యం చేయొద్దని, దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తు పరిష్కార స్వభావాన్ని పిర్యాదుదారునికి తెలియ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలలో ఇన్ స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం : వెంకటాపురం మండలంలోని ఎదిర ఎంపీ యుపిఎస్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు బోధించుటకు బోధకుడు (ఇన్స్ట్రక్టర్), ఆయా నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా బోధకుడు (ఇన్ స్ట్రక్టర్) పోస్టు కోసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించాలని, ఆయా పోస్ట్ కోసం ఏదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని, ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ఈనెల 23న సాయంత్రం 5 గంటల వరకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

# ఎస్ఐకి సన్మానం



అక్షర దర్బార్, మల్హర్: నాగులమ్మ నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్, ఎస్ఐ-2రాజన్ కుమార్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగులమ్మ ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు వీరమనేని సంపత్ రావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుర్ర సుధాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్, ఉపాధ్యక్షులు రాగం కుమార్, జాయింట్ సెక్రటరీ గా మడుగురి నాగరాజు, కోశాధికారి జల్లారపు ప్రసాద్, ప్రెస్ క్లబ్ సభ్యులు చింధం భాస్కర్ చొప్పరి రాజయ్య, చొప్పరి రాజు, లింగన్న పేట శ్రీనాథ్, పాల్గొన్నారు.



# మార్కెట్ లోకి కల్తీ నూనె

**- ఆరోగ్యానికి హానికరమని వినియోగదారుల ఆందోళన**

**- ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టాలని డిమాండ్**



అక్షరదర్బార్, పరకాల: దసరా పండుగను పురస్కరించుకుని నూనెకు డిమాండ్ ఉండటంతో కొందరు వ్యాపారులు కల్తీ నూనెను మార్కెట్లోకి తెస్తున్నారు. కల్తీ నూనెను అందమైన ప్యాకెట్లలో ప్యాక్ చేసి బ్రాండెడ్ ఉత్పత్తుల్లా విక్రయిస్తున్నారని తెలుస్తోంది. దీంతో వినియోగదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పరకాలలో ఓ వ్యాపారి పశువుల ఎముకలతో నూనె తయారు చేసిన ఘటనను ప్రజలు ఇంకా మరిచిపోలేదు. ఈ నేపథ్యంలో మార్కెట్ లోకి కల్తీ నూనె వచ్చిందనే ప్రచారం వినియోగదారులను ఆందోళనకు గురి చేస్తోంది. కల్తీ నూనె వాడితే గుండె సంబంధిత వ్యాధులు, కాలేయ సమస్యలు, జీర్ణకోశ సమస్యలు, దీర్ఘకాలిక అనారోగ్యాలు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వినియోగదారులు మోసపోకుండా ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు ప్రస్తుతం దసరా పండుగ వేళ కిరాణా షాపులు, సూపర్ మార్కెట్లు, హోల్‌సేల్ డిపోలపై ఆకస్మిక దాడులు జరిపి నాణ్యత లేని, కల్తీ నూనెను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం



అక్షర దర్బార్ శాయంపేట : పేదల సొంతింటి కలను నెరవేర్చే వారి జీవన ప్రయాణ మెరుగుపర చడానికి తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ నిర్మాణాన్ని అమలు చేసింది.ఈ పథకం ద్వారా రాష్ట్రంలో నిరుపేదలైన సొంతింటి ఇల్లు లేని వారికి ఇంటి నిర్మాణానికి తగిన సహాయం చేస్తుంది.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మొరం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులు చర్చించారు. శాయంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణం కొరకు కావాలసిన ఇసుక మొరం వాటిపై ప్రభుత్వ అధికారులు చర్చించారు. ఇందిరమ్మ ఇండ్ల ఇసుక రవాణా పూర్తిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ నిబంధనలు అనుగుణంగా సరఫరా వ్యవస్థను నిమిత్తం ఇసుక తరలించే వాహనాలకు లైసెన్సు కలిగి ఉండి కూపన్ల సహాయంతో సరఫరా చేయాలి ఇసుకను ఎక్కువ రేట్లకు అమ్మకూడదని తెలియజేశారు.ఇట్టి నియమాలను పాటించక పోతే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రంజిత్ రావు ,ఎస్సై పరమేశ్వర్, ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో ఫణిచంద్ర , జీపీ కార్యదర్శి అధికారులు పాల్గొన్నారు

# ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



అక్షరదర్బార్, వరంగల్: జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సోమవారం వరంగల్ శంభునిపేట పోతన లైబ్రరీలోని పీపుల్స్ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌లో ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ తెలంగాణ చాప్టర్, అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో, వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి సహకారంతో నిర్వహించారు.ప్రధాన అతిథి అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అనసూర్య మాట్లాడుతూ, "ఆయుర్వేదం కేవలం వైద్యపద్ధతి మాత్రమే కాదు, ఆరోగ్యకరమైన జీవనశైలి. రోగం వచ్చిన తర్వాత చికిత్స కంటే రోగం రాకుండా కాపాడడమే దీని లక్ష్యం" అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొని రోగులను ఉచితంగా పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో శిబిరం నుండి ప్రయోజనం పొందారు.

# ఆస్తికోసం అన్నను హత్య చేసిన తమ్ముడు

**-చిరుతపల్లిలో విషాదం**

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం: వెంకటాపురం మండలం చిరుతపల్లి గ్రామంలో మానవత్వాన్ని కలిచివేసిన ఘటన చోటుచేసుకుంది. ఆస్తి వివాదం నేపథ్యంలో తమ్ముడు గొంది సాంబశివరావు, అన్న మాధవరావును హత్య చేశాడు. పోలీసుల సమాచారం ప్రకారం, మద్యానికి బానిసైన సాంబశివరావు తన వాటా భూమిని అమ్మాలని తరచూ అన్నతో వాదనలు చేసేవాడు. అమ్మకానికి అడ్డుపడుతున్నాడని కోపంతో మద్యం మత్తులో ఘర్షణకు దిగిన అతడు గునపంతో మాధవరావు తలపై బలంగా కొట్టి చంపాడు. రక్తస్రావంతో మాధవరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సాంబశివరావును అదుపులోకి తీసుకున్నారు. మృతుడి చెల్లెలు కోరం నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు.



# ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

అక్షరదర్బార్, మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ శివాలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.ఆశ్వీయుజ శుక్ల ప్రతిపాద మొదలుకొని నవమి వరకు తొమ్మిది రాత్రులను నవరాత్రుల వ్యవహరిస్తారు. ఏడాది పొడవునా వచ్చే నవరాత్రి ఉత్సవాలలో దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రత్యేకంగా మహిళలు భావిస్తారు. ఆశ్వయుజ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యే దేవీ నవరాత్రి ఉత్సవాలు విజయదశమి వరకు జరుగుతాయి.హిందూ సాంప్రదాయంలో శక్తి స్వరూపిణి అయిన పార్వతీ అవతారాలలో నవదుర్గ అవతారాలను ముఖ్యమైనవిగా భావిస్తారు. ఆ తల్లి బ్రహ్మ, విష్ణు, శివ అంశలతో మహా సరస్వతి, మహాలక్ష్మి, మహాంకాళిగా అవతరించినట్లు పురాణ కథ చెబుతున్నది.ప్రతి అవతారం నుంచి మరొక రెండు రూపాలు వెలువడి మొత్తం తొమ్మిది రూపాలలో నవదుర్గలుగా భావిస్తారు. మహిళలు, పురుషులు ఈ తొమ్మిది రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు నియమ నిబంధనలు పాటిస్తూ అమ్మవారిని కొలుస్తారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాకాల రఘురాం శర్మ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేసి పూజా కార్యక్రమాలు చేపట్టారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పాకాల రఘురాం శర్మ తెలిపారు.





# యూరియా పక్కదారి!

- పరకాల నుంచి కమలాపురం మండలానికి బయల్దేరిన యూరియా
- మార్గమధ్యంలో నడికూడ వద్ద పట్టుకున్న రైతులు
- ఏఈఓ అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపణ
- విచారణకు ఆదేశించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



అక్షరదర్బార్, పరకాల: యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పీఏసీఎస్ లు, ఎరువుల దుకాణాల ఎదుట బారులు తీరుతున్నారు. చెప్పులు, పట్టాదారు పాసు పుస్తకాలను క్యూ లైన్ లో పెడుతున్నారు. రెండు బస్తాల కోసం రోజుల తరబడి తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో బాధ్యత కలిగిన వ్యవసాయ శాఖ అధికారులు కొందరు రైతులకు పంపిణీ చేయాల్సిన యూరియాను దారి మళ్లిస్తుండటం అన్నదాతను కలవర పరుస్తుంది. వివరాల్లోకి వెళ్తే... హనుమకొండ జిల్లా పరకాల పీఏసీఎస్ పరిధిలోగల నాగారం క్లస్టర్ లోని రైతులకు సోమవారం వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో యూరియా బస్తాల పంపిణీ జరిగింది. దీంతో యూరియా కోసం నాగారం క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులు పరకాల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గల పీఏసీఎస్ గోదాము వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో ఇక్కడి నుంచి ఒక బొలెరో వాహనం పది బస్తాల యూరియాతో పొరుగున ఉన్న కమలాపురం మండలంలోని శనిగరం గ్రామానికి బయలుదేరింది. గమనించిన నాగారం గ్రామ రైతు బొజ్జం తిరుపతి ఆ బొలెరో వాహనాన్ని వెంబడించారు. మార్గమధ్యంలో నడికూడ మండల కేంద్రం సమీపంలోని వంతెన వద్ద రైతులతో కలిసి ఆ బొలెరో వాహనం ఆపారు. నాగారం క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులకు పంపిణీ చేయాల్సిన యూరియా బస్తాలను వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) కాటం రాజు అక్రమంగా తన బంధువుల కోసం పది బస్తాల యూరియాను బొలెరో వాహనం ద్వారా శనిగరం తరలిస్తున్నారని అధికారుల దృష్టికి తెచ్చారు. సమాచారం అందడంతో రంగంలోకి దిగిన పోలీసులు పది బస్తాల యూరియాతో కూడిన బొలెరో వాహనాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని పరకాల పీఏసీఎస్ గోదాము వద్దకు తరలించారు. అక్రమంగా 10 బస్తాల యూరియాను బొలెరో వాహనం ద్వారా తన బంధువుల కోసం తరలించిన ఏఈఓ కాటన్ రాజుపై చర్యలు తీసుకోవాలని రైతు బొజ్జం తిరుపతి డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే తాము పంపిణీ చేసిన తర్వాత యూరియా బొలెరో వాహనంలో తరలిపోతుందని వ్యవసాయ శాఖ అధికారి పేర్కొంటున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా రైతులకు పంపిణీ చేయాల్సిన యూరియా పక్కదారి పట్టడం పరకాలలో కలకలం రేపింది. యూరియా పక్కదారి పట్టడంపై రైతులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పది బస్తాల యూరియా బొలెరో వాహనంలో తరలిపోతుండగా రైతులు పట్టుకున్న అంశంపై విచారణ జరిపాలని పరకాల ఆర్డీఓ, పోలీస్ ఇన్ స్పెక్టర్ ను ఆదేశించారు.

# ఇల్లు ఒకరికి..? బిల్లు మరొకరికా?



- మున్సిపల్ అధికారుల చేతివాటం...
- సాంక్షన్ లేని వ్యక్తికి బిల్లు మంజూరు...
- తిలా పాపం తలా పిరికెడు...
- నేనే రాజు నేనే మంత్రి అంటున్న మున్సిపల్ కార్యాలయంలోని ఓ అధికారి...

అక్షర దర్బార్, కేసముద్రం : సొంత ఇల్లు అనేది ప్రతి పేదోడి కల. ఎంత పెదరికంలో మగ్గినా ఉండేందుకు కనీసం గూడు ఉండాలి అనుకుంటారు. ఇలా ఆ నిరుపేద బిడ్డలు అనుకోవడం ప్రస్తుతకాలంలో  తీరని కలగానే మిగులుతుంది. అలాంటి పేదబిడ్డలకు ఆసరాగా ఉండేందుకు, అండగా నిలిచేందుకు, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి పథకాన్ని తీసుకొచ్చింది. అయితే.. కొంత మంది అధికార పార్టీ నాయకులు, అధికారుల స్వార్థం కారణంగా పథకం తప్పుదారి పడుతుంది. పథకంలో అసలు లబ్ది దారులు కాకుండా అర్హుల జాబితాలో పేరే లేనివాళ్ళు పథకం లబ్ది పొందే కుట్రకు తెరలేచింది. ఇళ్ళు తన పేరుపై మంజూరు అయి అర్హుల జాబితాలో ఉండగా తనకు తెలియకుండా, తన ప్రమేయం లేకుండా ఆ వ్యక్తి పేరుపై ఇల్లు నిర్మించకుండానే ఇందిరమ్మ బిల్లు పడటంతో అసలు తతంగం వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి గండం ఏర్పడింది. అధికారుల తప్పిదమో ప్రజాప్రతినిధుల అండ బలమో కానీ ఈ పథకానికి తూట్లు పడుతున్నాయి. అర్హత ఉండి ఇళ్లు రాక ఒకడు ఏడుస్తుంటే.. అర్హుల జాబితాలో లేకున్నా అధికారుల అండతో మరొకరు ఇల్లు నిర్మించడం విశేషం. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రజాప్రతినిధి వెన్నంటే ఉండే వ్యక్తి ఈ కార్యానికి తెరలేపాడు అనడంలో అతిశయోక్తి లేదు. మున్సిపాలిటీ పరిదిలో ఓ వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల జాబితాలో ఆ వ్యక్తి పెరు లేదు. కానీ అదే జాబితాలో మరో వ్యక్తి పేరు మీద ఈ ప్రజాప్రతినిధి వెన్నంటే ఉండే వ్యక్తీ,ఇల్లు నిర్మాణం స్టార్ట్ చేసాడు, బేస్మెంట్ పూర్తి చేశాడు. తీరా మొదటి విడతగా రూ.లక్ష రూపాయల బిల్లు మంజూరు అయింది. ఈ ఫండ్ ఇల్లు నిర్మాణమే చేపట్టని వ్యక్తి ఖాతాలో పడ్డాయి. అయితే సదరు నిర్మాణ దారుడు ఆవ్యక్తిని సంప్రదించి... "మీ అకౌంట్ లో లక్ష రూపాయలు వేయించాము. అవి మాకు పంపించాలి" అని తెలిపాడు. అయినప్పటికీ వినకపోవడంతో కొందరు అధికారనేతలని వెంటపెట్టుకొని వెళ్లి ఈ నగదు ఇవ్వాలని ఒత్తిడి చేసాడు. సదరు బాధితుడు అనుమానం వచ్చి తహాశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించగా అసలు కథ బయట పడింది. "మీ పేరు మీద ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయింది.. అకౌంట్ లో పడిన లక్ష రూపాయలు అట్టి పథకంలోని మొదటి విడత గ్రాంట్ " అని కార్యాలయ అధికారులు వివరించారు. ఇక్కడ బాధితుడు.. తన ప్రమేయం లేకున్నా నా పేరుపై మరో వ్యక్తి ఇల్లు కట్టుకోవడం ఏంటి..? ఆ వ్యక్తికి సంబంధించిన ఇంటి నిర్మాణం బిల్లు నా అకౌంట్ లో పడటం ఏంటి? అని ప్రశ్నిస్తున్నాడు.

## ఎవరి ప్రోద్బలం..?

వాస్తవానికి ఇందిరమ్మ ఇంటి పథకంలో ప్రభుత్వం రూ. 5లక్షలు ఇస్తుంది. అవి కూడా విడతల వారీగా మంజూరు చేస్తుంది. పక్కగా పకడ్బందీగా ఈ వ్యవహారాన్ని నిర్వహిస్తుంది. ప్రతి విడత గ్రాంట్ రిలీజ్ కావాలన్న ఫోటో అప్లోడ్ చేయాలి. ఇదంతా ఒక ప్రాసెస్. అయితే.. ఇక్కడి బాధితుడి విషయంలో అనేక అనుమానాలు ఉత్పన్నం అవుతున్నాయి. మొదట ఇంటికి ముగ్గుపోసినప్పుడు లబ్ధిదారుడి ఆధార్,ఈజీఎస్ ఐడి, బాంక్ అకౌంట్ డీటెయిల్స్ తో అప్లోడ్ చేయాలి, బేస్మెంట్ లెవల్ ఫోటో అప్లోడ్ చేయాలి అప్పుడే మొదటి విడత నిధులు వస్తాయి. ఇక్కడ బాధితుడికి తెలియకుండా పైన చెప్పిన వివరాలు ఎవరివి నమోదు చేశారు..? అకౌంట్ డీటెయిల్స్ ఎవరు ఇచ్చారు..? ఈజీఎస్ ఐడి ఎక్కడ సంపాదించారు.? అర్హుడికే తెలియకుండా ఈ తతంగం నడిపిన ఆ అధికారగణం నిర్వాకం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. మొత్తం ఎపిసోడ్ లో అధికారులు, ఆ ప్రజాప్రతినిధి వెన్నంటే ఉండే వ్యక్తికి వత్తాసు పలికిన అధికారుల, ప్రజాప్రతినిధుల వైఫల్యం కనిపిస్తుంది. బయటికి వచ్చిన కథ ఇది.. రాకుండా ఇంకా ఎన్ని కథనాలు ఉన్నాయో అనే అనుమానం రేకెత్తుతుంది. అర్హులకి లబ్ది చేయకుండా అనర్హులుగా ఎంపిక చేసుకొని నిజమైన వారిని మోసం చేస్తూ.. వారి పేరును వాడుకొని.. అధికారులు, స్థానిక నాయకులు ఎంత పోగు చేసుకుంటున్నారు? అని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్న పరిస్థితి. ఒక రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుల స్థానికత అయిన కేసముద్రంలోనే ఈ ఘనకార్యం జరుగుతుంటే ఇంకా మాములు ప్రదేశాల్లో ఎలా ఉంది అనేది అర్థం చేసుకోవచ్చు.

## సమగ్ర విచారణ చేయాలి..!

కేసముద్రం మున్సిపాలిటీలో చోటు చేసుకున్న ఈ ఘటనపై ఉన్నతస్థాయి అధికారులు విచారణ చేయాలి. అసలైన లబ్ది దారులకు న్యాయం జరుగుతుందో లేదో అరా తీయాలి. ఇలాంటి ఘటనలకి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోకపోతే ఇందిరమ్మ పథకం, ప్రభుత్వ లక్ష్యం రెండు నిరుకారిపోతాయి మరి....




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915